క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి బియ్యం, సరుకులు పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వాంబే కాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ డీఐజీ కిరణ్ కుమార్, జిల్లా రిజిస్ట్రార్ రామారావు, తమ సిబ్బంది సహకారంతో నెలకు సరిపడే బియ్యం బస్తాలు, నిత్యవసర వస్తువులు ఇవ్వగా హెల్పింగ్ హాండ్స్ వెంకట్ వాటిని ఆశ్రమ నిర్వాహకులకు అందించారు.

అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకం చేశారు. బి.పూర్ణయ్య గురుస్వామి స్వామివారికి విశేషంగా పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో స్వాములు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి పారాయణం చేశారు.

పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ), హైదరాబాద్ వారి 18వ వార్షికోత్సవాల్లో భాగంగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను గుర్తించి అక్షరబ్రహ్మ, సేవాబ్రహ్మ పురస్కారాలతో సత్కరించనున్నట్లు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అక్షర బ్రహ్మ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరిస్తామన్నారు. అలాగే వృద్ధులు, అనాథలు, దివ్యాంగులు వంటి పలు సామాజిక రంగాల్లో సేవలందిస్తున్న సమాజ సేవకులకు 'సేవా బ్రహ్మ' పురస్కారంతో సన్మానిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సేవాతత్పరులు వారు చేస్తున్న సేవా కార్యక్రమాల వివరాలతో ఈ నెల 25వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెం. 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం, పోస్టు : తిరుమలగిరి, సికింద్రాబాద్ 15 నకు పంపించాలని కోరారు. ఎంపిక చేసిన వారిని వచ్చే నెల 11వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా సత్కరిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 9652347207 ఫోన్ చేయాలని కోరారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యంపై కేసు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భర్తతో తరచూ విభేదాలు తలెత్తుతున్నాయని మనస్థాపానికి గురైన ఓ మహిళ తన కుమారుడితో సహా అదృశ్యమైన ఘటన సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన కట్ల నాగలక్ష్మికి జంపన్న అనే వ్యక్తితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. కొన్ని రోజుల నుంచి భర్తతో తరచూ నాగలక్ష్మికి గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా ఇదే విధంగా ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకోవడంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కుమారుడిని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న నాగలక్ష్మి తల్లిదండ్రులు వారి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. నాగలక్ష్మి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సామాజిక న్యాయం నినాదాన్ని పాటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. స్థానిక 58వ డివిజన్ 260 వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన డివిజన్‌లోని కనకదుర్గానగర్, ఆంధ్రప్రభ కాలనీ, ఆంధ్రపత్రిక కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. 252 గడపలను సందర్శించి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలపై ప్రజలను ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో ఈ ప్రాంతం ఎంతగానో మార్పు చెందిందని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు లభిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ఏ ముఖం పెట్టుకుని గవర్నర్‌ను కలిశారు..?

రాష్ట్రంలో భౌతిక దాడులు, ఆటవిక రాజ్యం, అరాచక పాలన సాగింది ముమ్మాటికీ చంద్రబాబు హయాంలోనేనని మల్లాది విష్ణు తెలిపారు. తెలుగుదేశం నాయకులు గవర్నర్‌ను కలవడాన్ని ఆయన తప్పుబట్టారు. గవర్నర్ వ్యవస్థను రద్దుచేయాలని గతంలో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన టీడీపీ నాయకులే మరలా ఏ ముఖం పెట్టుకుని ఆయనను కలిశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ పాలనలో మంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు, సర్పంచ్ నుంచి జన్మభూమి గ్రామ కమిటీ సభ్యుడి దాకా సాగించిన దౌర్జన్యకాండ అంతాఇంతా కాదని విమర్శించారు. కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి వచ్చిన అమిత్ షా కాన్వాయ్‌ను వెంబడించి మరీ ఆనాడు టీడీపీ శ్రేణులు కర్రలు, రాళ్లతో దాడికి తెగబడ్డారని గుర్తుచేశారు. తహసీల్దార్ వనజాక్షిపై చింతమనేని దాడి చేస్తే తప్పు ఆమెదేనంటూ రౌడీని వెనకేసుకొచ్చారన్నారు. ఇటువంటి భయానక ఘటనలు టీడీపీ ప్రభుత్వంలో అనేకం చోటుచేసుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ పై జరిగిన దాడిని నగర ప్రజలు నేటికీ మరచిపోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే రాష్ట్రంలో మరలా ప్రశాంతత నెలకొందన్నారు. కనుక గోబెల్స్ ప్రచారాలను మానుకోవాలని టీడీపీ నాయకులకు హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలన చూసి టీడీపీ నాయకులకు, ఎల్లో మీడియాకు నిద్రపట్టడం లేదన్నారు. ఎలా అయినా రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలనే అక్కసుతో ప్రతి రోజూ వారు రాష్ట్రంపై విషం కక్కుతున్నారని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమ దినోత్సవం జయప్రదం చేయండి

ఈ నెల 11న ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ఆవరణలో జరగనున్న మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో ముస్లిం మైనార్టీలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మైనార్టీ ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఏటా నవంబర్ 11న మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితో రాష్ట్రంలోని మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం మన జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నాయకులు ఎండీ హఫీజుల్లా, అఫ్రోజ్, అబ్దుల్‌నజీర్, ఇస్మాయేల్, ఎస్.డి.బాబు, షేక్ మస్తాన్, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయదుర్గానగర్‌లో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ జానారెడ్డి



పసుపుతోట వైద్య శిబిరంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



62వ డివిజన్‌లోని శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యకర సమాజ స్థాపనే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ విజయదుర్గానగర్‌లో బుధవారం జగనన్నఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు దోహదం చేస్తాయని చెప్పారు. అవసరమైన రక్తపరీక్షలు, ఈసీజీ, కంటి, పంటి వైద్య పరీక్షలు చేయటంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. 1021 కుటుంబాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు , వార్డు సచివాలయం సిబ్బంది ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 30వ డివిజన్ పసుపుతోటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. 777 కుటుంబాలకు చెందిన ప్రజలు ఆరోగ్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం, నాయకులు వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ శారదా హైస్కూల్, 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాల్లో ఎమ్మెల్యే విష్ణు కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి వెంకట్రావ్, అలంపూరు విజయలక్ష్మీలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎప్పటికప్పుడు షుగర్, బీపీ చెక్ చేసుకొంటూ ఆరోగ్యం పట్ల అవగాహన కల్గి ఉండాలని సూచించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, ఆర్ఎస్ నాయుడు, రామాంజనేయులు, దుర్గాప్రసాద్‌రెడ్డి, నాగిరెడ్డి, రంగారెడ్డి, చీకటి నాగమణి, అలంపూరు విజయ్, కె.వీరబాబు,బుజ్జి, రామిరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి బోర్డు డైరెక్టర్ అంజిబాబు, హైమావతి, సావిత్రి, సుభాన్, డాక్టర్లు నరేంద్రనాయక్, స్పందన, వసంత, మౌలాలి పాల్గొన్నారు.

వెయ్యి మందికి వైద్య పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు చెందిన వారు అధిక సంఖ్యలో వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. 62వ డివిజన్‌లో వరుసగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరాల్లో దాదాపు వెయ్యి మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ కె.రాజ తెలిపారు. పలు వ్యాధులకు సంబంధించి మందులను ఉచితంగా 15 రోజులకు సరిపడు మందులను అందచేశారు. వృద్ధులు కంటి వెలుగులో పరీక్షలు చేయించుకొని కళ్ళజోళ్ళకు రిఫర్ చేసిన కేసులు దాదాపు 200 వరకు వున్నట్లు తెలిపారు. షుగర్,బీపీ, గైనకాలజి, ఆర్థో సమస్యలను వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగిన వైద్య శిబిరాల్లో జనరల్ వైద్య నిపుణులతో పాటు గైనకాలజి, పీడియాట్రిక్ వైద్య నిపుణులు పాల్గొని సేవలందించారు. పేద కుటుంబాలకు చెందిన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు అధికంగా ఉపయోగపడినట్లు డాక్టర్ రాథోడ్ చెప్పారు. నాలుగు రోజుల పాటు ఎమ్మెల్యే మల్లాది విష్ణు వైద్య శిబిరాలను సందర్శించారు.

సీఐడీ ఆఫీసులో ఉద్యోగం పేరుతో మోసం

పాయకాపురం(విజయవాడరూరల్): సీఐడీ ఆఫీసులో ఉద్యోగం పేరుతో నమ్మించి ఓ వ్యక్తి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కండ్రిక బోస్‌నగర్‌కు చెందిన మోక సువర్ణరాజు డిగ్రీ చదివి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఈ క్రమంలో చిన్నప్పటి స్నేహితుడైన వాంబేకాలనీకి చెందిన రవికుమార్ ఓ పెళ్లిలో కలిశాడు. తాను సీఐడీ ఆఫీసులో అకౌంటెంటుగా పనిచేస్తున్నానని రవికుమార్ చెప్పాడు. ఉద్యోగం ఇప్పిస్తానని సువర్ణరాజును నమ్మించాడు. పలు దఫాలుగా సువర్ణరాజు నుంచి రూ.12 లక్షలు రవికుమార్ తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు కోసం రవికుమార్‌ను ఒత్తిడి చేశాడు. ఈ నేపథ్యంలో సీఐడీ ఆఫీసులో ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం వచ్చిందని నమ్మబలికాడు. 2022 జూన్ 30వ తేదీలోగా జాయిన్ కావాలని సువర్ణరాజుకు వాట్సాప్‌లో అపాయిమెంట్ లెటర్ పంపించాడు. ఆ లెటర్ తీసుకొని సువర్ణరాజు సీఐడీ ఆఫీసుకు వెళ్లాడు. అక్కడి అధికారులు ఆ లెటరు చూసి ఫేక్ అని చెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి డబ్బులు కోసం రవికుమార్‌పై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాడు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో చేసేది లేక న్యాయం చేయాలని సువర్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి స్వర్ణోత్సవాలు



భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమ స్వీకార మహోత్సవాలు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న జగద్గురువులు శృంగేరీ పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమం స్వీకరించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఈ నెల 10 వ తేదీ నుంచి డిసెంబరు 29 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆదిశంకరులు స్థాపించిన శృంగేరీ పీఠం భారతీ సనాతన ధర్మం, వేద సంస్కృతికి కృషి చేస్తుందని తెలిపారు. గురుపరంపరలో సాగే పీఠంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందన్నారు. ఉత్తరాధికారి విధుశేఖర భారతి ఆశీస్సులతో ప్రతి రోజూ జగదుర్గువుల వైభవం అంశంగా ప్రసంగాలు ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. 10 నుంచి 19 వ తేదీ వరకు శంకర విజయం అంశంగా ఆచార్య శలాక రఘునాథ శర్మ, 20 నుంచి 26 వరకు సురేశ్వరాచార్య మహాస్వామి అంశంగా విశ్వనాథ గోపాల కృష్ణ శాస్త్రి, 27 నుంచి 30 వ తేది వరకు విద్యారణ్య మహాస్వామి అంశంగా ముదిగొండ శంకరయ్య, డిసెంబరు 1 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు సచ్చిదానంద నృసింహ భారతీ స్వామి వైభవం అంశంగా తంగిరాల రాజేంద్ర ప్రసాద్ శర్మ, 6 నుంచి 12 వ తేదీ వరకు చంద్రశేఖర భారతీ స్వామి అంశంగా పురాణం మహేశ్వరస్వామి వైభవం, 13 వ తేదీ నుంచి 19 వ తేదీ వరకు విద్యాతీర్థ మహాస్వామి అంశంగా 20 వ తేదీ నుంచి 29 వరకు భారతీ తీర్థ స్వామి అంశంగా ఆధ్యాతిక ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేద పండితులు వీరుభొట్ల ఫణిశర్మ మాట్లాడుతూ 50 రోజులపాటు నిత్యం పరమేశ్వరునకు అభిషేకాలు, రుద్రపారాయణం, జరుగుతుందని తెలిపారు. సమావేశంలో గండూరి చంద్రమౌళీశ్వర శర్మ పాల్గొన్నారు.

గడువులోగా ఆర్‌యూబీ పనులు పూర్తి చేయాలి



మధురానగర్ ఆర్‌యూబీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మధురానగర్ ఆర్‌యూబీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 28వ తేదీలోగా నిర్మాణ పనులు పూర్తిచేయాలని సూచించారు. అలాగే మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులలో కనెక్టింగ్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మిగిలిన రిటైనింగ్ వాల్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లైటింగ్ లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని చెప్పారు. రైల్వే అండర్ బ్రిడ్జి లోపల ఉండే రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే పనివాళ్ళను పెంచి పనులన్నీ సమాంతరంగా ఒకేసారి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఈ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కడప పెద్ద దర్గాలో ఎమ్మెల్సీ రుహుల్లా ప్రత్యేక ప్రార్థనలు



పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో గెలుపొందాలని, మన సీఎం జగనన్న అ'ద్వితీయంగా' సీఎం పీఠాన్ని తిరిగి అధిరోహించాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కడపలోని అమీన్ పీర్ దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పెద్ద దర్గాను సందర్శించిన ఆయనకు దర్గా ముజావర్లు ఇస్లాం సాంప్రదాయం ప్రకారం ముందుగా సత్కరించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ప్రార్థనలు చేశారు. నిరంతరం పేదవర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం ఆలోచన చేస్తూ అమలు చేస్తున్న సీఎం జగనన్నకు ఆ అల్లాహ్ ఆశీస్సులు ఎళ్లవేళలా పుష్కలంగా ఉండాలని దువా చేశారు.

రైల్వే డివిజన్ ఆదాయం రూ.3,143.69 కోట్లు



మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ చివరినాటికి విజయవాడ డివిజన్ రూ. 3,143.69 కోట్ల స్థూల ఆదాయం సాధించినట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. డివిజినల్ రైల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యుసీసీ) 132వ సమావేశం బుధవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌యుసీసీ చైర్మన్, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అక్టోబర్ నాటికి రూ.3,143.69 కోట్ల ఆదాయం సాధించగా అందులో ప్రయాణికుల సెగ్మెంట్ నుంచి రూ. 813.78 కోట్లు, సరుకు రవాణా నుంచి రూ. 2,232.16 కోట్లు, ఇతర మార్గాల ద్వారా రూ.97.75 కోట్లు వచ్చినట్లు వెల్లడించారు. అమృత్ భారత్ పథకం ద్వారా డివిజన్‌లో 20 ప్రధాన రైల్వే స్టేషన్‌లలో ఆధునికీకరణ పనులు, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపర్చినట్లు వివరించారు. విజయవాడ-గూడూరు సెక్షన్‌లో 24.16 కిలో మీటర్ల విద్యుదీకరణతో మూడవ లైన్ నిర్మాణం, ముస్తాబాద్-రాయనపాడు మధ్య ఆర్‌ఓఆర్ (రోడ్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణంతో 6 కిలోమీటర్ల నూతన లైన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు డివిజన్ వ్యాప్తంగా అమృత్ భారత్ పథకం ద్వారా ప్రధాన రైల్వే స్టేషన్‌లలో 16 ఎఫ్ఓబీలు, తొమ్మిది స్టేషన్‌లలో 23 ఎస్కలేటర్లు, నాలుగే స్టేషన్‌లలో 28 లిఫ్టల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. రైళ్ల నిర్వహణ, ట్రాక్‌ల పటిష్టత పనులు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం డీఆర్‌యుసీసీ సభ్యులతో కలసి పలు విషయాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌యుసీసీ సభ్యులు, ఏడీఆర్ఎం ఎమ్.శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీఓఎం నరేంద్రవర్మ, సీనియర్ డీఈఈ సురేష్‌బాబు, సీనియర్ డీఈ వరుణ్‌బాబు, పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్, ఇతర అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అలరించిన విష్ణుభొట్ల గాత్ర కచేరి



కచేరీ నిర్వహిస్తున్న విష్ణుభొట్ల సోదరీ మణులు

విజయవాడ కల్చరల్: సద్గురు సంగీత సభ 30 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో బుధవారం విఖ్యాత సంగీత సోదరీ మణులు విష్ణుభొట్ల కృష్ణవేణి, సరస్వతి నిర్వహించిన గాత్ర కచేరి అలరించింది. వాగ్గేయకార కీర్తనలను మధురంగా ఆలపించారు. స్వామి నిన్నుకోరి, శ్రీజాలంధర, కమలాంబ సంరక్షంతు, నీదయరాదా తదితర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎన్‌సీ మాధవ్, మృదంగంపై బీవీఎస్ ప్రసాద్, ఘటంపై రామకృష్ణ వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సద్గురు సంగీతసభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో చెన్నై తర్వాత సంగీత ఉత్సవాలు విజయవాడలోనే జరుగుతాయని తెలిపారు. దేశ విదేశాల్లో లబ్ధప్రతిష్టులైన విద్వాంసులు కచేరీలు నిర్వహిస్తారని తెలిపారు. సంగీతసభ్యులు గాయత్రి గౌరీనాథ్, జే ప్రభాకర శాస్త్రి ప్రసాద్ శర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. విష్ణుభొట్ల సోదరీ మణులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): యువకుడి అదృశ్యంపై ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీసెంట్‌రోడ్డులోని ఒక వస్త్ర షోరూమ్‌లో సెల్స్‌మెన్‌గా పనిచేసే బొట్టు శివ కార్తిక్ కుటుంబ సభ్యులతో కలసి నగరంలోని ముత్యాలంపాడు, అల్లూరి సీతారామరాజు రోడ్డులో నివాసముంటున్నారు. గత నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పనికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్ళిన కార్తిక్ రాత్రి అయినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అతను పని చేసే షోరూమ్‌లో విచారించగా రాలేదని తెలిపారు. దీంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన సోదరుడు సాయిరాం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బెజవాడలో భారీ వర్షం



బెజవాడలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్లన్నీ జలమయమ్యాయి. బెంజిసర్కిల్, పటమట, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, గుణదల, అజిత్‌సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట, భవానీపురం, కృష్ణలంక, చిట్టినగర్ తదితర ప్రాంతాలన్నీ వర్షం ముంచెత్తింది. ఆయా ప్రాంతాల్లో వీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది రోడ్లపై నిలిచిన నీటిని ఎయిర్‌టెక్ మిషన్లతో తోడేశారు. బందరురోడ్డు, ఏలూరురోడ్డు, బెంజిసర్కిల్, పోలీస్‌కంట్రోల్‌రూం, లోబ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ కొద్దిసేపు స్తంభించింది. ఆయా ప్రాంతాల్లోని పోలీసుల చొరవతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

–పటమట (విజయవాడ తూర్పు)





